క్లుప్తంగా

నల్లా కనెక్షన్లపై సర్వే



ధన్వాడ: మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్ల సర్వేను మండల కేంద్రంలో ఆయా గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ మేరకు.. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సాయి, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి సర్వే నమోదు వివరాలను చేపట్టారు. అలాగే మందిపల్లి పాత తండాలో ఇంటింటికీ తిరిగి సర్వే నమోదు వివరాలు నిర్వహించారు.

రైతుబంధు విడుదల చేయాలి

మరికల్: వానాకాలం పంటలకు గాను ప్రభుత్వం వెంటనే రైతుబంధు విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జూన్ మొదటి వారంలోనే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల ఖాతాలో రైతుబంధు జమ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతుబంధుపై మాట్లాడటం లేదన్నారు. దీంతో రైతులు అప్పులుచేసి పంటలకు పెట్టుబడులు పెడుతున్నారని గుర్తు చేశారు. వెంటనే రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా డ్రైయినేజీ మ్యాన్‌హోల్



మాగనూర్: మండల కేంద్రంలోని ఎన్‌హెచ్–167 రహదారికి ఇరువైపులా నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ అప్పుడే అస్తవ్యస్తంగా తయారైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ విరిగిపడి ప్రమాదకరంగా ఉన్నాయని వాపోతున్నారు. డ్రెయినేజీలో మొత్తం మట్టి ఉండటంతో మురుగు నీరుఎటు వెళ్లకపోవడంతో ఇళ్లలోకి దుర్వాసన వస్తుందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోవులను వధించే వారిని శిక్షించండి



మరికల్: దేశంలోని హిందువులంతా ఆరాధ్యదైవంగా పూజించే గోమాతను వధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు శనివారం పోలీసులకు వినతి పత్రాన్నిచ్చారు. రాత్రి సమయంలో గోవులను వాహనంలో కబేళాలకు తరలిస్తున్నారని, ఈ విషయంపై పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి ప్రతి వాహనాన్ని పరిశీలించాలని కోరారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం గోవధ చట్టాన్ని అమలు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో రవి, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మక్తల్: మండలంలోని రుద్రసముద్రంలో రెండు రోజుల నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బోరుమోటార్లు కాలిపోవడంతో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నార న్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని నీటి సమ్యసను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిన్నారి మృతికి కొవ్వొత్తులతో నివాళి

మరికల్: కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌లో ఆరేళ్ల చిన్నారి బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై శనివారం రాత్రి మండలంలోని చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా నిందితులను ప్రభుత్వం ఉరి తీయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, నిఖిల్, రఘు, రాజేష్, రాజు, చెన్నయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



తడిసి మోపెడు..

- అటు సాగు పెట్టుబడి.. ఇటు పిల్లల స్కూల్ ఫీజులు
- పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం



కొత్తపల్లి శివారులో పొలం దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

మద్దూరు: జూన్.. ఈ మాసంలో తొలకరి వాన పలకరింపు సంబురంతోపాటు వ్యవసాయ పెట్టుబడి ఆరాటం.. నూతన విద్యాసంవత్సరం ప్రారంభంతో పిల్లలకు కొత్త పుస్తకాలు కొనుగోలు చేయడం, బడి, కళాశాలల ఫీజులు చెల్లించడం వంటి ఖర్చులతో పేద, మధ్యతరగతి కుటుంబాలు సతమతమయ్యే కాలం. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు జూన్ వచ్చిందంటేనే వామ్మో అనే పరిస్థితి.

అన్నదాత పరిస్థితి అగమ్య గోచరమే..

జిల్లాలో దాదాపు 1.70 లక్షలకు పైగా రైతులు ఉన్నారు. ఈ వానాకాలం సీజన్‌లో పంటలకు పెట్టుబడి సమయం అసన్నమైంది. వ్యవసాయ పంట భూములు చదును చేసి, దుక్కి దున్ని, విత్తనాలు, ఎరువులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయదారులు పనులు ప్రారంభించారు. కనీసం ఎకరానికి రూ. 30వేల పెట్టుబడి అవసరం ఉంటుంది. ఐదు ఎకరాలున్న రైతు దాదాపు రూ. లక్షకు పైగా డబ్బు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఇస్తున్నా అది సరైన సమయానికి చేతికందడం లేదు. పైగా బ్యాంకుల రుణాలు కూడా అసవరమైన సమయానికి అందడం లేదు. దీంతో రైతులు ఒకవైపు బ్యాంకు చుట్టూ తిరుగుతూనే మరోవైపు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

బడి ఫీజుల భారం..

జిల్లాలో 80పైగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. గ్రామీణ, మండలస్థాయిలో కొంత మేర తక్కువ ఫీజులు వసూలు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో ఫీజులు ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులకు రూ. 10వేలకు పైగా, ప్రైమరీకి రూ.15వేలు, హైస్కూల్‌కు రూ.30వేల నుంచి 40వేల వరకు ఫీజులు ఉన్నాయి. ఏటా రూ.10నుంచి 20 శాతం మేర ఫీజులు పెరుగుతుండడంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. ఈ నేపథ్యంలో అటు పిల్లల చదువులు ఇటు వ్యవసాయ పెట్టుబడికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

వ్యవసాయ పెట్టుబడి ఎకరాకు ఇలా..
పత్తి విత్తనాలకు రూ.1,500
దుక్కి, సన్నద్ధత కోసం రూ. 6నుంచి 8వేలు
కూలీల ఖర్చు రూ. 3వేలు
ఎరువుల రూ. 6వేలు
పురుగు మందు రూ. 16వేలు
పత్తి తీయడానికి రూ. 4వేలు
వరి సాగుకు ఖర్చు రూ. 30వేలు
జొన్న సాగుకు ఖర్చు రూ. 20వేలు
కంది సాగుకు ఖర్చు రూ. 30వేలు

ప్రైవేట్ చదువులకు ఖర్చులు ఇలా..
ప్రీ ప్రైమరీ, ప్రాథమిక స్థాయిల్లో అడ్మిషన్ ఫీజు రూ. 2వేలు నుంచి 5 వేలు
స్కూల్, ట్యూ షన్ ఫీజు రూ.10వేల నుంచి రూ. 30వేలు
పుస్తకాలకు రూ. 2వేల నుంచి రూ.5 వేలు
రెండు జతల యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్‌లు రూ. 3వేల నుంచి రూ. 4 వేలు
బస్సు రవాణా కోసం రూ. 10వేల నుంచి రూ. 12వేలు

రెండు వైపులా భారం..



జూన్ వచ్చిందంటే ఒక వైపు పిల్లల చదువుల ఖర్చులు, పంట పెట్టుబడులు.. ఇలా రెండు వైపులా ఒకే నేలలో ఖర్చు పెట్టాల్సి రావడంతో భారం పడుతోంది. ఏటా వేసవి సెలవులు పూర్తవుతున్నాయంటనే మానసిక ఒత్తిడి కలుగుతోంది. ప్రభుత్వం నుంచి రైతు భరోసా డబ్బులు త్వరగా ఇవ్వాలి. ఈ డబ్బులతో కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంటుంది. అలాగే ప్రైవేట్ స్కూళ్లపై ఫీజు నియంత్రణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలి.

– రోయ్యలి ఆనంద్, రైతు

పరస్పర సహకారంతో సమాజాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: పరస్పర సహకారంతో సమాజాభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నారాయణపేట బ్రాంచి ఐదవ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.. ధనవంతులు తమ సంపదపై దృష్టిసారించడంతోపాటు సమాజసేవకు కృషి చేయాలన్నారు. సేవా సొసైటీ ద్వారా చిన్న వ్యాపారులకు వడ్డీలేని రుణాలు అందజేయడంతో సంఘం అభివృద్ధి చెందుతుందన్నారు. సేవా సొసైటీకి పూర్తి మద్దతు ఇచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ఈ మేరకు.. పేట శాసనసభ సభ్యురాలు సేవా సొసైటీ పేటశాఖలో ఐదేళ్లపాటు విజయవంతంగా సేవలందించినందుకు అభినందనలు తెలిపారు. సేవా సొసైటీ అధ్యక్షుడు ఉస్మాన్ అబ్దుల్లా ముజాహిద్ సిద్ధిఖీ మాట్లాడుతూ.. అల్లా వడ్డీని హరామ్‌గా, వ్యాపారాన్ని హలాల్‌గా ప్రకటించాడన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఫెసిలిటేషన్ మైక్రోఫైనాన్స్ ఆపరేషనల్ మేనేజర్ ముహమ్మద్ పర్వేజ్ మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో ఫెసిలిటేషన్ మైక్రోఫైనాన్స్‌కు 43శాఖలు ఉండగా, 95,000 మందికి పైగా సభ్యులున్నారన్నారు. కార్యక్రమంలో సేవా సొసైటీ అధ్యక్షుడు ఉస్మాన్ ఒబైదుల్లా ముజాహిద్ సిద్ధిఖీ, డీపీఆర్‌ఓ మహమ్మద్ అబ్దుల్ రషీద్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ పర్వేజ్ సాహిబ్, వివిధ బ్రాంచిల నిర్వాహకులు షేక్ సుజాత్ అలీ, అబ్దుల్ ఖయ్యూం, అహ్మద్ ఖాన్, జహీరుద్దీన్, అన్వర్ పాషా, హుస్సేన్ పాషా, నాసిర్, స్థానిక కౌన్సిలర్లు అమీరుద్దీన్, మహమ్మద్ సలీం, నాయకులు వేణుగోపాల్, అబ్దుల్ ఖాదర్, మహ్మద్ కాజీం, మహ్మద్ ఖురేషి, ఎజాజ్ హుస్సేన్, అడ్వకేట్ సతీష్‌గౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పచ్చదనం పెరిగితేనే జీవుల మనుగడ



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, తదితరులు



మాగనూర్‌లో..

కోస్గి: భూమిపై విస్తారంగా పచ్చదనం పెరిగితేనే జీవుల మనుగడ సాధ్యమని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శేఖరయ్య అన్నారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం పాఠశాలలో పర్యావరణ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మానవాళి ప్రాణాలు కాపాడే గాలి, నీరు, ఆహారం, ప్రకృతి ద్వారానే లభిస్తుందన్న విషయం గుర్తించుకోవాలని హెచ్‌ఎం సూచించారు. అంతకుముందు విద్యార్థులకు ప్రకృతి నడక అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏకో ఎర్త్ క్లబ్ కో–ఆర్డినేటర్ వార్ల మల్లేశం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మాగనూర్: పల్లెలన్ని పచ్చదనంతో కళకళలాడాలని ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహార కార్యక్రమంలో భాగంగా శనివారం బైరంపల్లి, ఉజ్జెల్లి గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారుల వెంబడి మొక్కలు నాటారు. భవిష్యత్ తరాల వారికి ఆరోగ్యకరమైన వాతవారణం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు.

నులిపురుగు నివారణపై అవగాహన



దామరగిద్దలో సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

దామరగిద్ద: నులిపురుగుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి నవనీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆశ కార్యకర్తలకు జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు మట్టిలో ఆడుకోవడం బహిరంగ మల విసర్జన వంటి వాటితో కడుపులో నులిపురుగులు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశుభ్రత పాటిస్తూ రోగాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చందన, పీహెచ్‌ఎన్ జానకమ్మ, సూపర్‌వైజర్ వెంకటేష్, కిష్టమ్మ పాల్గొన్నారు.

మరికల్: పాఠశాల విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీపై శనివారం ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు, వైద్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు కిరిటి, హర్షిత మాట్లాడుతూ ఈ నెల 20న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మాత్రలు వేసే విధానాన్ని వివరించారు. నులి పురుగుల మాత్రలు వేయడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారన్నారు. హెచ్‌ఎంలు నాగరత్నమ్మ, బాలనారాయణగౌడ్, గోవర్ధన్‌గౌడ్, సీఆర్‌పీలు శివకుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయానికి చర్యలు



దామరగిద్ద: పిడుగు పాటుకు గురై రెండు వేర్వేరు కుటుంబాల్లో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరి కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ జయరాములు తెలిపారు. బాధిత కుటుంబాలను రెవెన్యు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో వారి వివరాలను సేకరించి పంచనామ చేశారు. త్రిమెన్ కమిటీ రిపోర్ట్‌ను కలెక్టర్‌కు అందజేసి ప్రభుత్వం ద్వారా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం విఠలపూర్‌లోని బాధిత కుటుంబాలను కలిసి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాములు, వీఆర్‌ఏలు, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి..

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డి శివారులోని 169 సర్వే నంబర్‌లోని 7ఎకరాల 32 గుంటల భూమిని ప్రభుత్వం అసైన్డ్‌మెంట్ ద్వారా తమకు ఇచ్చారని, ఆ భూమిలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన రిటైర్డ్ అధికారి ఒకరు అక్రమంగా తమ పొలాన్ని దున్నుతున్నారని బాధితులు తిమ్మక్క, శాంతప్ప, చెట్టె బస్వరాజ్‌లు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



కోటకొండ పీఎస్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం



మక్తల్‌లో..

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండ ప్రాథమిక పాఠశాలలో బోధనకు చేర్చిన చిన్నారులకు శనివారం అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మొదటిసారి పాఠశాలకు వచ్చిన చిన్నారులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఓనమాలు దిద్దించారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా సర్కారు బడిలో చదువుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందిస్తామని, నిష్ణాతులైన టీచర్లతో బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పూర్వపు కాంప్లెక్స్ హెచ్‌ఎం రవికుమార్, ప్రధానోపాధ్యాయులు నసరోద్దిన్‌ఖాద్రె, ఏఏపీ కమిటీ చైర్మన్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు అంజమ్మ, రుక్మిణి, ఉపాధ్యాయులు చంద్రకాంత్, ప్రజ్ఞ, భాగ్యలక్ష్మి, తిరుపతినాయక్, రమాదేవి, చంద్రిక, పావని పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని అనుగొండ మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు శనివారం చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిసారి పాఠశాలకు వచ్చి 1వ తరగతిలో కూర్చున్న చిన్నారులకు ఓనమాలు దిద్దించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందిస్తామని అన్నారు. అంతకుముందు పాఠశాలలో సరస్వతి మాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, కమిటీ చైర్మన్ నాగమణి, ఉపాధ్యాయులు మన్యం, మహేందర్‌గౌడ్, కుర్మయ్య, ప్రేమ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు లలిత, అంబికా, లింగమ్మ పాల్గొన్నారు.

గేటు అమర్చారు.. కాంపౌండ్ మరిచారు



మక్తల్: మండలంలోని భూత్పుర్‌లో ప్రాథమిక పాఠశాల వద్ద ప్రహరీ నిర్మాణం చేపట్టకుండానే కేవలం గేటు మాత్రమే అమర్చారు. పాఠశాల సమీపంలో రిజర్వాయర్ ఉండటంతో పాముల బెడద అధికంగా ఉంది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



కృష్ణాలో దుస్తులు అందిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో ఖాన్‌దొడ్డి ప్రాథమిక, కున్సి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను శనివారం హెచ్‌ఎంలు సంతోషి, శేఖర్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. పాఠశాలకు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగ్గా ఏకరూప దుస్తులను ధరించి రావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షురాలు దీప, వీబీకే నర్సప్ప, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రాఘవేంద్ర, శివరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలో గత కొన్నిరోజులుగా బడిబాట కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. షెడ్యుల్ ప్రకారం రెండు రోజులుగా మండలంలోని ఆయా పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించారు. శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తువుల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా 5వ, తరగతి విద్యార్థులను 6 తరగతికి ప్రమోట్ చేస్తూ ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలో చేరేవిధంగా వారికి ధృవపత్రాలను అందజేశారు. వారిని ఆరో తరగతిలో అడ్మిషన్‌ను ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు చేర్పుకున్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహించారు.

నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

అమరచింత: చంద్రప్ప తండాకు చెందిన శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం రూ.పది వేల విలువ గల నోట్‌పుస్తకాలను చంద్రనాయక్‌తండా పాఠశాల విద్యార్థులకు వితరణ చేశారని హెచ్‌ఎం సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో తనవంతు భాగస్వామ్యం కావాలన్న సంకల్పంతో విద్యార్థులకు పుస్తకాలు అందించానన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు.

భవిత విద్యార్థులకు..

పట్టణంలోని భవిత కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థులకు బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశామని హెచ్‌ఎం బాలస్వామి, సీఆర్పీ స్వామి తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పిస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం



డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: మండలంలోని గుంటిపల్లిలో శనివారం అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ కార్యకర్త బుచ్చన్న కుటుంబసభ్యులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ పరామర్శించారు. ఆత్మకూర్‌లో కార్యకర్త రఘు కుటుంబసభ్యులను కలిసి పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సీనియర్ నాయకుడు అజ్మతుల్లా జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మక్తల్ నియోజకవర్గంలోని మండలాల్లో అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గంగాధర్‌గౌడ్, జిల్లానాయకుడు రహ్మతుల్లా, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంలకు సన్మానం

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాల జీహెచ్‌ఎం శేఖర్ రెడ్డిని శనివారం తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయుల సహకారంతో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన హెచ్‌ఎం తెలిపారు. సన్మానించిన వారిలో తపస్ మండల అధ్యక్షుడు రవీందర్ నాయక్, జిల్లా కార్యదర్శి చెన్నయ్య, నాయకులు మనోహర్, సత్యనారాయణ, రాకేష్, భాను ప్రకాష్‌రెడ్డి, స్వర్ణలత, అంబిబాయ్, వనజ, సీఆర్పీ దస్తయ్య పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల, ధన్వాడ, కొండాపూర్, కిష్టాపూర్, గోటూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతన హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన జీహెచ్‌ఎంలను శనివారం పీఆర్టీయూ నాయకులు శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, నరేందర్, బాలరాజు, సుధీర్‌కుమార్, ముస్తఫా పాల్గొన్నారు.



శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు




దామరగిద్దలో జీహెచ్‌ఎం అన్నపూర్ణను సన్మానిస్తున్న నాయకులు

దామరగిద్ద: జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది బాధ్యతలు తీసుకున్న పలువురు జీహెచ్‌ఎంలను పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణ సమక్షంలో సంఘం సభ్యులు ఉపాధ్యాయులు కాన్‌కుర్తి జీహెచ్‌ఎం అన్నపూర్ణ, దామరగిద్ద జీహెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్న అశోక్‌ను శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథ్, నాయకులు శంభులింగం, నాగేందర్, ఉషనప్ప, శివరాములు, వెంకటప్ప, బల్వీర్, సునిత పాల్గొన్నారు.



ధన్వాడలో..

పనిచేయని సీసీ కెమెరాలు



మాగనూర్: ప్రభుత్వ కార్యాలయాల్లో విలువైన పత్రాలు, వస్తువులతోపాటు ప్రభుత్వ సిబ్బంది రక్షణ కోసం ప్రభుత్వం రూ. వేలు ఖర్చు చేసి తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో అవి మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు వృథాగా పడి ఉన్నాయి. వీటిని అధికారులు ప్రతిరోజూ చూస్తునే ఉన్న తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత తహసీల్దార్ దృష్టి సారించి వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకే కేటాయించాలి

కొత్తకోట రూరల్: రాష్ట్ర మత్స్య సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలని కొత్తకోట మండల ముదిరాజ్ సంఘం నాయకులు రాజమౌళి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న 5వేల చేపల సహకార సంఘాల్లో 4,300కు పైగా సంఘాల్లో ముదిరాజులే ఉన్నారని, కేవలం 700సంఘాలు కలిగిన బేస్త కులస్తుల వారిని చైర్మన్‌గా నియమించడం సరికాదన్నారు.